
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
శనివారం 1 మార్చి 2025







నిండా నిరాశ...!

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం 2025-26 బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టిన సంపూర్ణ బడ్జెట్ జిల్లాను నిండా ముంచేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్థిక మంత్రి పయ్యావుల రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం వల్ల ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఉంటుందని సీమ సాగునీటి సాధన సమితి, రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాల నాయకులు ఆశించారు. కానీ జిల్లా ప్రజల ఆశలపై బడ్జెట్ నీరు చల్లింది. రూ.924 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపితే.. కోతలు కోసి రూ.442.82 కోట్లతోనే సరిపుచ్చారు. జీతాలు, ఇతర ఖర్చులు, విద్యుత్ బిల్లులు పోను ప్రాజెక్టులు, కాలువ మరమ్మతులకు ఇచ్చింది కేవలం రూ.272.76 కోట్లు మాత్రమే. మూడు యూనివర్సిటీలకు జీతాలు, నిర్వహణ నిధులతో సరిపుచ్చారు. కర్నూలు, ఆదోని మెడికల్ కళాశాలల నిర్మాణాలకు నిధుల ఊసే లేదు. ఓర్వకల్లు పారిశ్రామికవాడకు ఏమిస్తున్నదీ బడ్జెట్‌లో లేదు. దీని వల్ల ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం ఏమీ లేదని ఆర్థికవేత్తలు అంటున్నారు.

విశ్వవిద్యాలయాలకూ అంతే



జిల్లాలో విశ్వవిద్యాలయాలకు జీతాలు, నిర్వహణ నిధులతో సరిపుచ్చారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయానికి కేవలం రూ.3.30 కోట్లు మాత్రమే ఇచ్చారు. అసంపూర్తి భవనాలు నిర్మాణాలు, నిర్వహణ కోసం రూ.31.26 కోట్లు అడిగితే పది శాతం కూడా ఇవ్వలేదు. క్లస్టర్ యూనివర్సిటీ శాశ్వత భవనాలు రూ.139 కోట్లతో చేపట్టారు. 2025-26 బడ్జెట్‌లో నిర్వహణ కోసం రూ.2 కోట్లు, జీతాలకు రూ.1.10 కోట్లు సహా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు రూ.150 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదిస్తే.. రూ.1.20 కోట్లతో సరిపుచ్చారు. అంటే.. ఈ ఏడాది రీసెర్చ్ లేనట్లే. రాయలసీమ వర్సిటీకి రూ.13 కోట్లు అవసరం ఉందని అడిగితే.. రూ.11.28 కోట్లు ఇచ్చారు. రాయలసీమ వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకే ఈ ఏడాది మోక్షం లేనట్లేనా..? ఇతర నిధులు ఇస్తారా? అని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

- ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్టులపై చిన్నచూపు
- రూ.924 కోట్లు అడిగితే.. ఇచ్చింది రూ.442.82 కోట్లే
- అందులో పనులకు రూ.272.76 కోట్లు మాత్రమే
- వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువలకు నిధులు కరువే
- ఉర్దూ, క్లస్టర్ వర్సిటీ భవనాలకు పైసా లేదు
- కర్నూలు మెడికల్ కాలేజీకి 46 పీజీ సీట్లు
- 2025-26 బడ్జెట్‌లో కందనవోలుపై కనికరం చూపని కేశవ్

కర్నూలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాజెక్టులకు జల ద్వారమైన ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్టులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అరకొర కేటాయింపులతో సరిపుచ్చారు. కరువు. వలసల నివారణ లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వంలో ఎంతో ఆర్భాటంగా పనులు ప్రారంభించిన వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులకు మొండి చూపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 9.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఆ స్థాయిలో నిధులు ఇవ్వకపోవడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ బడ్జెట్‌లో ప్రాజెక్టులు, కాలువలు నిర్వహణ, అసంపూర్తి ప్రాజెక్టులకు రూ.1,200 కోట్లు అవసరమని అంచనా వేస్తే.. ప్రభుత్వం సూచన మేరకు రూ.924 కోట్లకు కుదిస్తే.. ఆ నిధులైనా ఇచ్చారంటే అదీ లేదు. కేవలం రూ.442.82 కోట్లతో సరిపుచ్చారు. అందులో జీతాలు, విద్యుత్ బిల్లులు, భూ సేకరణ, ఇతర ఖర్చుల కేటాయింపులు పోను వివిధ పనులకు ఇచ్చింది కేవలం రూ.272.76 కోట్లే. అందులోనూ కుందూ విస్తరణ పనులకే రూ179 కోట్లు వెళ్తుందని ఇంజనీర్లు అంటున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారు. కొత్తగా చేపట్టే రాజోలి, జొళదరాశి ప్రాజెక్టులకు రూ.40 కోట్లు అడిగితే పైసా కూడా ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర అన్యాయం చేశారని సీమ సాగునీటి నిపుణులు అంటున్నారు.



ఆర్డీఎస్ ఆనకట్ట

మిగతా 7వ పేజీలో

ప్రాజెక్టుల వారిగా ప్రతిపాదనలు, కేటాయింపులు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	ప్రతిపాదన	2025-26 కేటాయింపు	2024-25 కేటాయింపు
శ్రీశైలం ప్రాజెక్టు	55	31.47	32.60
టీబీపీ ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్	250	30.00	13.00
కేసీ కెనాల్, కుందూ విస్తరణ	183	179.28	253.24
ఎస్సార్బీసీ కాలువ	40	5.52	46.70
రాజోలి, జొళదరాశి ప్రాజెక్టులు	40	--	--
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	30	34.06	69.06
గాజులదిన్నె జలాశయం	28	11.98	11.80
68 చెరువుకుల నీటి ఎత్తిపోతలు	40	37.00	20.00
సిద్ధాపురం ఎత్తిపోతల పథకం	8	10.24	6.29
జీతాలు, ఇతర ఖర్చులు	250	103.27	108.57
మొత్తం	924	442.82	560.22

బ్రహ్మోత్సవాలకు యాగ పూర్ణాహుతి

నేటితో ముగియనున్న శివరాత్రి ఉత్సవాలు



హోమగుండంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న వేదపండితులు, ఈఓ

శ్రీశైలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం పదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అర్చకులు, వేదపండితులు యాగ పూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూలస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. తరువాత వసంతోత్సవం నిర్వహించారు. చివరగా అవబుధ స్నానం, త్రిశూలస్నానం జరిపించారు. సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల మొదటిరోజున బ్రహ్మోత్సవ పారంభ సూచికంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన ధ్వజపటాన్ని అవరోహణ చేశారు. మహాశిరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఉదయం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ, ఆలయ ఉత్సవం జరిపించనున్నారు. ఆలయ ఉత్సవం అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకలో ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు : మహాశిరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఉదయం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ, ఆలయ ఉత్సవం జరిపించనున్నారు. ఆలయ ఉత్సవం అనంతరం స్వామి అమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం నిర్వహించనున్నారు.

సదస్యం..నాగవల్లి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు నిత్యకల్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమం జరిపించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులు వేదస్వస్తి నిర్వహించారు. వేదపండితులు చతుర్వేద పారాయణలతో స్వామిఅమ్మవార్లను స్తుతించారు. నాగవల్లి కార్యక్రమంలో మహాశివరాత్రి పర్వదినాన మల్లన్నను కల్యాణమాడిన భ్రమరాంబ అమ్మవారికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలను సమర్పించారు.



చండీశ్వర స్వామికి త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

చెంచుల సంక్షేమానికి తోడ్పాటు

కలెక్టర్ రాజకుమారి



గిరిజనుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చెంచు గిరిజనులకు అటవీ ఫల సహాయంతో జీవన ప్రమాణాలను పెంపొందించుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల పరిధిలోని బైర్లూటి చెంచు గూడెంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఐటీడీఏ పీవో శివప్రసాద్ పర్యటించారు. నన్నారి మొక్కల సాగుతో చెంచుల జీవన ప్రమాణాలను పెం ంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రోత్సాహాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చెంచులు వ్యవసాయ ఉత్పత్తులతో పాటు అటవీ ఫల సహాయాన్ని వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించకుండా జీసీసీ కేంద్రాలకు మద్దతు ధరకు విక్రయించుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. చెంచుల నుంచి సేకరించిన ఉత్పత్తులను జిల్లాలో ఏర్పాటు చేసిన వికాస కేంద్రాల్లో నన్నారితో పాటు వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఫల సహాయాన్ని నేరుగా విక్రయించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారి కేజీ నాయక్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏపీవో నాగార్జున, సర్పంచ్ గురువమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహానందీశా.. నమోనమః

- మహానందిలో వైభవంగా రథోత్సవం
- శివ నామస్మరణతో మార్మోగిన నల్లమల



మహానందిలో రథోత్సవం

మహానంది, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన మహానందిలో శుక్రవారం సాయంత్రం మహానందీశ్వరుడి రథోత్సవం వైభవంగా కొనసాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముందుగా మహానందీశ్వర స్వామి, కామేశ్వరీ అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. వివాహ పెద్దగా వ్యవహరించిన నంద్యాల బ్రహ్మనందీశ్వరుని ఉత్సవమూర్తులకు ఆలయ వేదపండితులు పూజలు జరిపారు. అనంతరం ఆలయం సమీపంలోని రథశాల వద్ద ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు రథాంగ పూజ, హోమం తదితర పూజలు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం కుమ్మరి వీరయ్య భక్తి శ్రద్ధలతో కుంభాన్ని రథశాల వద్దకు తీసుకొచ్చి ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన రథోత్సవం గంటపాటు కొనసాగింది. ఈ ఉత్సవానికి నంద్యాల జిల్లా న్యాయాధికారి వాసు, ఉప న్యాయాధికారి రాధారాణి, ఏడీఎం లక్ష్మీ, ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఉత్సవాల ప్రత్యేకాధికారి రామాంజనేయులు, తహసీల్దార్ రమాదేవి, ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, దేవిక, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, పసుపుల సుబ్బారెడ్డి, అర్చకులు మామిళ్ళపల్లి రాఘవేంద్రశర్మ, మణికంఠశర్మ, వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.



రథాంగ పూజలో పాల్గొన్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

కోలాహలంగా అశ్వవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అశ్వవాహనంపై మహానందీశ్వర స్వామి, కామేశ్వరీ అమ్మవారు విహరించారు. రథోత్సవం అనంతరం రాత్రి పుష్పశయనోత్సవాన్ని నిర్వహించారు. కాగా నేడు మహా పూర్ణాహుతి, తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఆలయంలోని రుద్రగుండం కోనేరులో ఉత్సవ మూర్తులకు త్రిశూల స్నానం, కలశ ప్రదక్షిణ, యాగశాల మండపంలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వెల్లడించారు.



అశ్వ వాహనంపై మహానందీశ్వరుడు



నేటి నుంచి గురు వైభవోత్సవాలు

- 6వ తేదీన రాఘవేంద్రస్వామి జన్మదిన వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన మఠం అధికారులు

మంత్రాలయం,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాలకు శ్రీమఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం నుంచి ఆరు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు ముఖ్య అతిథులుగా హాజరై 404వ పట్టాభిషేక మహోత్సవాలకు శ్రీకారం చుడుతారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు రాష్ట్ర మంత్రులకు గురువైభవోత్సవ -2025 అవార్డులను ప్రదానం చేస్తారు. పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, మేనేజర్,ఈఈ సురేష్ కోణాపూర్, ఏఈ బద్రినాథ్‌లు పేర్కొన్నారు.



రాఘవేంద్రస్వామి మఠం మహాముఖద్వారం

నేడు మంత్రాలయానికి నారా లోకేశ్

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ, అధికారులు 6



చుక్కలు చూపుతున్నారు..!

- పట్టా భూములుగా పరిగణించాలని ఉత్తర్వులు
- అయినా పట్టని అధికారులు
- భూ సమస్యలతో నలిగిపోతున్న రైతులు
- వెయ్యికి పైగా ఎన్‌వోసీ ఫైళ్లు పెండింగ్
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- పట్టించుకోని అధికారులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): **రైతులు, భూ యజమానులకు అధికారులు చుక్కలు చూపుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిందిపోయి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు. క్లియరెన్స్ అయిన భూములను మళ్లీ పెండింగ్‌లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో రైతులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు జిల్లాలో చుక్కల భూములు (ఆర్‌వోఆర్, ఆర్‌హెచ్ రికార్డులు ఉన్న భూములు) సమస్యలైతే మరింత ముదిరిపోతున్నాయి. కోర్టులతోపాటు ప్రభుత్వం ఈ భూములను పట్టా భూములుగా పరిగణించాలని స్పష్టంగా పేర్కొన్నా జిల్లా అధికారులు మాత్రం ఆ దిశగా ముందుకు సాగడం లేదు. ఫలితంగా భూ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు.**

ఎన్‌వోసీ కోసం మూడంచెల విధానం

రెవెన్యూ శాఖ నిబంధనల ప్రకారం ఎన్‌వోసీ (నో అబ్జక్షన్ సర్టిఫికెట్) పొందాలంటే మూడంచెలుగా ఫైల్ ముందుకు కదలాలి. ముందుగు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఫైల్‌ను ఆర్‌డీవో కార్యాలయానికి పంపుతారు. చివరగా రెవెన్యూ కార్యాలయానికి ఫైళ్లు వెళ్లాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి ఫైళ్లు జిల్లా రెవెన్యూ కార్యాలయం వరకు వెళ్లి ఇక్కడ పేరుకుపోతున్నట్టు తెలుస్తోంది. ఒక్క జిల్లా రెవెన్యూ కార్యాలయంలోనే వెయ్యికి పైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం.

డీఎల్ఎస్‌సీ కమిటీ ఏం చేస్తోంది..?

భూ సమస్యల పరిష్కారానికి డిస్ట్రిక్ట్ లెవెల్ స్క్రూటినీ కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశాలు జరిపి తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. అయితే డీఎల్ఎస్‌సీ కమిటీ పని చేస్తుందా లేదా అన్నట్టుగా పరిస్థితి ఉంది. ఫైళ్లు పేరుకుపోతున్నా డీఎల్ఎస్‌సీ కమిటీ ఏం చేస్తోందని పలువురు రైతు సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి నెలా సమీక్ష జరపాల్సిన నిబంధన ఉన్నా నాలుగైదు ఫైళ్లను మాత్రమే పరిశీలించి సమావేశాలు ముగించేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అదికూడా తమకు అనుకూలమైన ఫైళ్లను మాత్రమే పరిశీలించి మిగతా వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల నిర్లక్ష్యంతో అవస్థలు

చాలా మంది రైతులు, భూ యజమానులకు భూ రికార్డులపై సరైన అవగాహన ఉండదు. ఆర్‌వోఆర్, ఆర్‌హెచ్, ఆర్‌ఎస్సార్, అడంగల్, వన్‌బీ, వెబ్‌ల్యాండ్ వంటి వాటి గురించి తెలియని వారు చాలా మంది ఉన్నారు. అందులోనూ నిరక్షరాస్యులకు తమ భూములను ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవడం కూడా రాదు. దీంతో రీసర్వేలో చివరకు వారి పేర్లే లేకుండా పోతున్నాయి. ఎప్పటికో విషయం తెలిసి రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే అక్కడ స్పందించేవాడే కరువు. దీనికితోడు కొన్ని గ్రామాల్లో వీఆర్వోలే సమస్యలు సృష్టిస్తున్నట్టు తెలుస్తోంది. డబ్బుల కోసం ఉన్న భూములు లేనట్టుగా లేనివి ఉన్నట్టుగా రికార్డులు తయారు చేసి కొత్త చిక్కులు తెచ్చి పెడుతున్నారు.

వినతులన్నీ భూ సమస్యలపైనే..

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే వినతుల్లో ఎక్కువ శాతం భూ సమస్యలపైనే వస్తున్నట్టు తెలుస్తోంది. దీన్నిబట్టి రెవెన్యూలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపైనే ఎక్కువ అర్జీలు వస్తున్నాయని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదిలా ఉంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో సమస్య పరిష్కారంగాక జిల్లా కేంద్రానికి రావడానికి చాలా మంది వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల భూ యజమానులు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నారు. తమ భూముల సమస్యలు పరిష్కరించుకోలేక అల్లాడిపోతున్నారు.

రెవెన్యూ రికార్డుల తప్పిదాల వల్ల

రెవెన్యూ రికార్డుల తప్పిదాల వల్ల పిల్లల చదువు, పెళ్లిళ్ల కోసం భూమి అమ్ముకోవాలంటే రిజిస్ట్రేషన్లు చేయించలేని పరిస్థితి. కొందరికి ఎన్‌వోసీలు ఉన్నా అడంగల్ రికార్డుల్లో భూమి స్వభావ మార్పు జరగడం లేదు. వాటిని జాయింట్ కలెక్టర్ లాగిన్ ద్వారా మాత్రమే మార్పు సాధ్యపడుతుండటంతో మళ్లీ తహసీల్దార్, ఆర్డీవో, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారుల స్పందన లేకపోవడంతో ముడుపులు చెల్లించక తప్పని పరిస్థితి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రతి నెలా పూర్తి స్థాయిలో డీఎల్ఎస్‌సీ సమావేశాలు నిర్వహించి పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాల్సి అవసరం ఉంది.

కోర్టు నుంచి వచ్చిన ఫైల్స్ మాత్రమే పరిష్కరిస్తున్నారు



రైతుల చుక్కల భూముల సమస్యలను అధికారులు పరిష్కరించకుండా నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారు. కోర్టు నుంచి వచ్చిన ఫైల్స్‌ను మాత్రమే పరిష్కరిస్తున్నారు. అది కూడా నెలలో 4 లేదా 5 మాత్రమే క్లియర్ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం నుంచి అనేక ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు నాలుగు సంవత్సరాలు పైగా అయింది. రైతులు భూమిని సాగు చేసుకోలేక, విక్రయించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

\- వీవీ నాయుడు, రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు

ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు



ఈ రైతు పేరు తిరుపతయ్య. నూతనపల్లె గ్రామంలోని 196 సర్వే నెంబరులో 5 ఎకరాల 90 సెంట్లు భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి 2011లో ఎన్‌వోసీ తీసుకున్నారు. ఆ తర్వాత భూమి ఆన్‌లైన్‌లో తన పేరు మీదకు మారింది. అయితే ఇటీవల జరిగిన రీసర్వేలో ప్రభుత్వం భూమిగా ఆన్‌లైన్ నమోదు చేశారు. దీంతో ఆ రైతు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తన వద్ద ఉన్న పత్రాలన్నీ సమర్పించి న్యాయం చేయాలని కోరాడు. అయినప్పటికీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ప్రతిరోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగడం ఆయన పనిగా మారింది. ఒకవేళ తహసీల్దార్ కార్యాలయంలో ఫైల్ కదిలినా సదరు భూ యజమాని మళ్లీ ఆర్డీవో కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరగక తప్పని పరిస్థితి.



చుక్కల భూములను పరిష్కరిస్తాం



గతంలో ఎన్‌వోసీ ఉండి అన్ని డాక్యుమెంట్లు ఉన్న రైతులు తహసీల్దార్లను కలవాలి. వారి ద్వారా తమ అర్జీలను పంపిస్తే చుక్కల భూముల సమస్యలు పరిష్కరిస్తాం. రైతులు భూ సమస్యలను తొలగించడానికి కృషి చేస్తున్నాం.

\- డీఆర్వో వెంకట నారాయణమ్మ

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్నాటక హైకోర్టు జడ్జి



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న హైకోర్టు జడ్జి సీఎం జోషి

మంత్రాలయం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కుటుంబ సమేతంగా కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సీఎం జోషి, అమరావతి అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహ మూర్తి ఘనంగా స్వాగతం పలికారు. వారు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట తహసీల్దార్ ఎస్.రవి, అనంతస్వామి, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో సంస్కృత పాఠశాల కారిడార్

- నేడు ప్రారంభించనున్న మంత్రి లోకేశ్
- సుందరంగా తీర్చిదిద్దిన శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో నిర్మించిన శ్రీగురు సార్వభౌమ సంస్కృత పాఠశాల కారిడార్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. శనివారం గురు వైభవోత్సవాలకు ముఖ్య అతిథిగా వస్తున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించనున్నారు. గత నాలుగు నెలల్లో శ్రీమఠం నుంచి రూ.1.50 కోట్లుతో, బెంగుళూరు చెందిన శంకర్ ఎలక్ట్రికల్ రూ.50 లక్షల విరాళంతో సుందరంగా నిర్మించారు. ఎంటీఆర్ దగ్గర నుంచి ఆధ్యాత్మిక కేంద్రం వరకు 560 అడుగుల పొడవు, 44 అడుగుల వెడల్పుతో రోడ్డు మధ్యన డివైడర్ నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్‌జోషి, శ్రీపతాచార్, మేనేజర్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురురాజు దగ్గరుండి అందంగా తీర్చిదిద్దారు. ఈ కారిడార్‌ను మంత్రి నారా లోకేశ్ ఆరంభిస్తారు. ఈ కారిడార్‌తో మంత్రాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది.

బ్యాంకులను లాభాల బాట పట్టించండి

జాయింట్ కలెక్టర్ బి.నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను లాభాలబాట పట్టించాలని జాయింట్ కలెక్టర్ ఇన్‌చార్జి అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్‌పర్సన్లు, సీఈవోలు, సహకార శాఖ, డీసీసీబీ బ్యాంకు అధికారుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ సమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంఘంగా ప్రకటించిందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా సహకార బ్యాంకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను లాభాల బాట పట్టించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేలా కృషి చేద్దామని స్పష్టం చేశారు. ఈ ఘనత సాధించేందుకు సహకార బ్యాంకు సంఘాల పరిధిలో ప్రతి నెలా వివిధ కార్యక్రమాలను నిర్వహించుకొని సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సర కాలంలో వివిధ ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకొని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి విజయం సాధించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామాంజనేయులు, బ్యాంకు ముఖ్య నిర్వహణాధికారి విజయకుమార్, జనరల్ మేనేజర్ రామాంజనేయులు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వర రెడ్డి సునీల్ కుమార్, బీవీ నాగిరెడ్డి, బీపీడీఎం సహీదా సుల్తాన్, సీఈవోలు, సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నేడు మంత్రాలయానికి నారా లోకేశ్



హెలిప్యాడ్ వద్ద పర్యటనా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, మీనాక్షి నాయుడు, కేఈ ప్రభాకర్, సోమిశెట్టి, రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాల ప్రారంభోత్సవానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ రానున్నారు. ఈమేరకు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు శుక్రవారం పర్యవేక్షించారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జిలు మీనాక్షినాయుడు, రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా, టీబీ డ్యాం చైర్మన్ టిప్పుసుల్తాన్, డీఎస్పీ ఉపేంద్రబాబు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్ మైదానంలో పాల్గొనే వీఐపీలు, స్వాగతం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, తహసీల్దార్ ఎస్.రవి, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, నాయకులు అమర్నాథ్ రెడ్డి, అశోక్ రెడ్డి, వరదరాజు ఉన్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ, అధికారులు



ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ

మంత్రాలయం గురు వైభవోత్సవాల ప్రారంభానికి ముఖ్య అతిథిగా వస్తున్న మంత్రి నారా లోకేశ్ పర్యటన వల్ల భక్తులకు ఇబ్బంది కలగకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం లోకేశ్ పర్యటనకు హెలిప్యాడ్, మధ్వమార్గ్ కారిడార్, విజయవిఠల్ ప్రధాన రహదారి, రూట్ ప్రోగ్రాంను పరిశీలించారు. లోకేశ్ పర్యటన ఏర్పాట్లలో పోలీసులు నిర్లక్ష్యంగా ఉండవద్దని అన్నారు. హెలిప్యాడ్ నుంచి రాఘవేంద్రస్వామి మఠం వరకు పక్కా ప్రణాళికతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మధ్వమార్గ్ కారిడార్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఘనంగా ప్రారంభమైన రోజా దర్గా ఉరుసు



గంధం ఉత్సవంలో పీఠాధిపతి సయ్యద్ షా దాదాబాషా ఖాద్రి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం సుంకేసుల రోడ్డులోని ప్రాముఖ్యతగల రోజా దర్గాలో హజ్రత్ సయ్యద్ షా ఇస్హాక్ సనావుల్లా ఖాద్రీ 535వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటూ కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెంది బాబా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే దర్గాలో ముస్లింలతో పాటు హిందూ భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొబ్బరికాయలు, పూలు, చాదర్‌లు సమర్పించుకున్నారు. శుక్రవారం రాత్రి ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధం ఉత్సవం నిర్వహించారు. రోజా వీధిలోని దర్గా పీఠాధిపతి సయ్యద్ షా దాదాబాషా ఖాద్రీ గృహం నుంచి భక్తులు ఊరేగింపుగా సందల్ ముఖద్దస్ (గంధం) తీసుకొని దర్గాకు చేరుకున్నారు. ఈ భారీ ఊరేగింపులో భక్తులు బాణసంచా కాలుస్తూ, మంగళ వాయిద్యాలతో, యువత సందడి చేశారు. అనంతరం పీఠాధిపతి ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేర నియంత్రణకు కృషి చేయండి

- పెండింగ్ కేసులను తగ్గించాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క పోలీసు నేర నియంత్రణకు కృషి చేయాలని, పెండింగ్ కేసులను తగ్గించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పోలీసు స్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. గ్రేవ్ కేసులు, యూఐ కేసులు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు, పోక్సో కేసులు, మిస్సింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, డ్రంకెన్ డ్రైవ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైనా విషయంపై పోలీసు అధికారులను వివరాలు అడిగినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతోపాటు పోలీసు సిబ్బంది కూడా ప్రతి ఒక్కరూ బైక్ నడిపేటప్పుడు లైసెన్సులు, హెల్మెట్లు కలిగి ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేయాలన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పెండింగ్ కేసుల వివరాలను టెలి కాన్ఫరెన్స్‌లో అడిగి తెలుసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్లను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ జి.హుసేన్‌పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు జే.బాబు ప్రసాద్, కె.శ్రీనివాసాచారి, హేమలత, బాస్కర్‌రావు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వైభవంగా బుగ్గ రామేశ్వరుని రథోత్సవం

- భారీగా తరలి వచ్చిన భక్తజనం
- శివ నామస్మరణతో మార్మోగిన క్షేత్రం
- భారీగా పోలీసు బందోబస్తు



అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పరిటాల శ్రీరామ్



కాల్వబుగ్గలో రథాన్ని లాగుతున్న భక్తులు



అమ్మవారిని తీసుకువస్తున్న పరిటాల శ్రీరామ్, గౌరు జనార్దన్ రెడ్డి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి సన్నిధిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం బుగ్గ రామేశ్వరుని రథోత్సవం రమణీయంగా సాగింది. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆయన తనయుడు గౌరు జనార్దన్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, అనంతపురం టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరు శివునికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు. రథానికి పూజలు చేసి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి, నందికోల సేవ, భాజభజంత్రీలు, మంగళ వాయిద్యాలతో ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. భక్తజనంతో శివనామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది. కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఫెస్టివల్ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, పెద్ద మల్లయ్య, మాత్య నాయక్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

49 బన్నూరులో టీబీ కేసుల పరిశీలన



49 బన్నూరులో టీబీ కేసులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

మిడుతూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని 49 బన్నూరు గ్రామంలో టీబీ కేసులను జిల్లా టీబీ యూనిట్ అధికారులు డాక్టర్లు తేజస్విని, పీటర్ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ ముక్త భారత్ ప్రోగ్రామ్‌కు 49 బన్నూరు గ్రామం ఎంపికైందని అన్నారు. పురాతన టీబీ వ్యాధిగ్రస్తులను గ్రామంలో తిరిగి వారి ఆరోగ్య పరిస్థితులను డాక్టర్లు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీబీ రికార్డులను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో కడుమూరు పీహెచ్‌సీ వైద్య అధికారి ముకేశ్, సూపర్‌వైజర్లు ఈశ్వర్, లతీఫ్ బాబు, చక్రపాణి, ఏసేపు, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

నందికొట్కూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు తాలుకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రాగిని నర్సరాజును సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సమావేశం స్థానిక గ్రామ రెవెన్యూ కార్యాలయంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నందికొట్కూరు తాలుకా అధ్యక్షుడు బాలరాజు తన వ్యక్తిగత కారణాల వల్ల అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా భువనేశ్వరి, కార్యదర్శిగా నల్లబోతుల మద్దిలేటి, ఉపాధ్యక్షులుగా సిరాజ్ అహ్మద్‌ను, జాకీర్ హుస్సేన్, కార్య నిర్వాహక కార్యదర్శిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో శుక్రవారం తూనికలు కొలతల అధికారి తనిఖీలు చేపట్టారు. నంద్యాలలో ముద్ర లేకుండా వాడుతున్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లను లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జిలానీబాషా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా బొగ్గులైన్‌లోని పవిత్ర గోడౌన్స్‌లో గల దాల్‌మిల్, నూనెపల్లెలోని ఎంజే ట్రేడర్స్‌కు చెందిన రైస్ మిల్లులో ప్రభుత్వ ముద్ర లేకుండా వాడుతున్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లను తనిఖీ చేసి కేసులు నమోదు చేసినట్లు అసిస్టెంట్ కంట్రోలర్ జిలానీ బాషా తెలిపారు. అసిస్టెంట్ కంట్రోలర్ జిలానీ బాషా మాట్లాడుతూ ఈ సంవత్సరం తనిఖీలలో భాగంగా 184 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ల వాడు వారు తప్పనిసరిగా ప్రభుత్వ ముద్ర వేయించుకోవాలన్నారు.

మూగజీవాలకు టీకాలు వేయించండి

సంజామల, ఫిబ్రవరి 28: మూగ జీవాలకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మోహన్‌రావు పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలలో పశువైద్యాధికారులు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఏడీ మాట్లాడారు మార్చి 1 నుంచి మండల వ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. గొర్రెలు, మేకలకు సోకే బ్రూ సెల్లోఫిష్ వ్యాధి నివారణకు టీకాలు వేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. బర్డ్‌ఫ్లూపై ప్రజలు అపోహలు వీడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రఘుబాలక్రిష్ణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

వేంపెంట వృషభాలకు మొదటి బహుమతి

పాములపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామంలో మహాశివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని నందీశ్వర స్వామి రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పాలబండ లాగుడు పోటీల్లో వేంపెంట గ్రామానికి చెందిన నెమలి వెంకటరమణారెడ్డికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.40,016 కైవసం చేసుకున్నాయి. శుక్రవారం ఈ పోటీలను టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి, రాము, శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. రెండో బహుమతి వనపర్తి జిల్లాకు చెందిన తిరుపతయ్య ఎద్దులు 30,016, మూడో బహుమతి కానాల గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఎద్దులు 20,016 కైవసం చేసుకున్నాయి.

మామిడి రైతులకు నేడు శిక్షణ

కొత్తపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, ఆత్మకూరు మండలాలకు చెందిన మామిడి రైతులకు శనివారం ఉదయం 11 గంటలకు వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఉద్యానవనశాఖ అధికారి చందన తెలిపారు. కొత్తపల్లి మండలంలో సుమారు 150 ఎకరాల్లో రైతులు మామిడి పంటను సాగు చేశారని అన్నారు. ఇటీవల మామిడిలో తేనె మంచు పురుగు ఆశించడం వల్ల మామిడి పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. రైతుల కోరిక మేరకు వారిలో అవగాహన కల్పించేందుకు ఆత్మకూరు పట్టణ శివారులోని ఇటుకల బట్టి ఎదురుగా ఉన్న మామిడి తోటలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే ఈ శిక్షణలో నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

గాడిచర్ల సేవలు ఎనలేనివి

వెలుగోడు ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు సేవలు ఎనలేనివని మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, బీసీ సంఘం నాయకులు రఘురాముడు యాదవులు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయ ఆవరణంలో ఆయన వర్ధంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుమలత, టీడీపీ నాయకులు ఖలీల్, రాము, తదితరులు పాల్గొన్నారు.

మిస్టరీగా ఇద్దరి మరణం

ఆత్మకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని 5వ వార్డులో గల నీలితొట్ల వీధిలో గురువారం ఇద్దరు మృతి చెందిన ఘటన మిస్టరీగా మారింది. తొలుత కాలనీలోని తాగునీటి పైపులైన్లలోకి డ్రైనేజీ వాటర్ చేరడంతో అతిసార ప్రబలి రహంతుల్లా (50), బషీరూన్‌బీ (50) మరణించడంతోపాటు మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారని ప్రచారం జరిగింది. దీంతో రాత్రికి రాత్రి అప్రమత్తమైన మున్సిపల్ అధికా రులు కాలనీకి చేరుకుని తాగునీటి పైపులైన్లను మరమ్మతులు చేయడం, పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం చేశారు. అలాగే ఆత్మకూరు అర్బన్ సీఐ రాము బాధిత కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను ఆరా తీశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పర్య వేక్షణలో బైర్లూటి పీహెచ్‌సీ వైద్యులు పవన్‌కుమార్, అహ్మద్‌బేగ్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ సాజిదా ఫిర్దోస్‌లు వైద్య శిబిరాల ను ఏర్పాటు చేశారు. నీలితొట్ల వీధికి సరఫరా జరిగే 300 తాగునీటి పైపులైన్ ను కొత్తగా ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టా రు. ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమే ష్‌బాబులు కాలనీని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మున్సిపల్ అధి కారులు కాలనీకి సరఫరా జరిగే నీటిని పరిశీలించగా అతిసార ప్రబలేం దుకు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని తెలిసింది. మృతుల మరణాలకు సంబంధించి పోస్టుమార్టం వివరాలు తెలిస్తే మిస్టరీ వీడే అవకాశం ఉంది.



దుర్గా భోగేశ్వరంలో రథోత్సవం



నందికోలతో నృత్యం చేస్తున్న సేవకుడు

రమణీయం రథోత్సవం

- నల్లమలలో 'ఓంకార' నాదం
- భక్తుల పూజలు



పాణ్యం: పాణ్యంలోని పాణికేశ్వరస్వామి ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈఓ సువర్ణ ఆధ్వర్యంలో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ పెరగడంతో ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకారంలో సిద్ధేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. శుక్రవారం ముందుగా గంగా ఉమా సమేత సిద్ధేశ్వర స్వామి వార్లకు అర్చనలు చేశారు. అనంతరం ఈవో నాగప్రసాద్ నేతృత్వంలో రథశాల వద్ద పూజలు చేసి రథాన్ని పూలమాలలతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామి వార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి, ఆలయం నుంచి రథశాల వద్దకు మంగళ వాయిద్యాల నడుమ ఈవోతో పాటు భక్తులు తీసుకొచ్చి రథంలో చేర్చారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమం నుంచి నైవేద్యాలు తీసుకొచ్చి అనంతరం కుంభం సమర్పించారు. అక్కడ అర్చకులు పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. రథోత్సవంలో మహిళల కోలాటం, నంది కోలా నృత్యం భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామి వార్లకు వసంతోత్సవం నిర్వహించారు. అలాగే విష్ణు నంది క్షేత్రలో ఈవో వేణునాథరెడ్డి, చైర్మన్ తిరుపెంరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో విష్ణునందీశ్వర, పార్వతీదేవి అమ్మవార్లను కొలువు దీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. బండిఆత్మకూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ వేడుకలో శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ భరద్వాజశర్మ, త్యాగరాజశర్మ, బాలీశ్వరరెడ్డి, రమణ, అంజి, బాలుడు పాల్గొన్నారు.

కన్నుల పండువగా దుర్గా భోగేశ్వరుడి రథోత్సవం

గడివేముల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన స్వామివారి రథోత్సవం రమణీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, సేవాకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను నందీ వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. స్వామివారికి ధూపదీప నైవేద్యాల అనంతరం సాత్విక బలులను సమర్పించారు. భక్తులు ఓంకార నామ శబ్దాలు చేస్తుండగా స్వామివారిని రథోత్సవంపై ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గడివేముల ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డిలు బందోబస్తు నిర్వహించారు.



ఓంకారంలో రథోత్సవం

ఓంకారం హుండీ లెక్కింపు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఓంకార సిద్ధేశ్వర స్వామివార్ల హుండీలను లెక్కించారు. శుక్రవారం శివరాత్రి ఉత్సవాల పరిశీలకుడు కార్తీక ఆధ్వర్యంలో ఈవో నాగప్రసాద్ హుండీ లెక్కింపు చేపట్టారు. శిరాత్రి ఉత్సవాల తాత్కాలిక హుండీ ద్వారా రూ.60,830లు, శాశ్వత హుండీలలో మూడు నెలల రాబడి రూ.1,13,994 లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో అర్చకులు, మల్లికార్జున, భక్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి అమావాస్య పూజలు



ఆత్మకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలసిన శ్రీఅభయాంజనేయ స్వామికి అర్చకులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ప్రాతఃకాల సమయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపి శాస్త్రోక్తంగా పూజక్రతువులను చేపట్టారు. అలాగే భజన కార్యక్రమాలు, సామూహిక కుంకుమార్చనలతో పాటు ధూప, నక్షత్రహారతులను నివేదించారు. రాత్రి మహామంగళహారతిని సమర్పించారు. కాగా అమావాస్య సందర్భంగా స్వామివారికి వివిధ యాపిల్, ద్రాక్ష పండ్లతో విశేష అలంగాణ గావించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ వారు అల్పాహార వితరణ చేపట్టారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం నిత్యకళారాధన వేదిక వద్ద విశాఖపట్నంకు చెందిన ఎం. సాయిసుప్రియ బృందంచే కథక్ నృత్యం, హైదరాబాదుకు చెందిన సాయికుమార్ బృందంచే సంప్రదాయ నృత్యం, మైదుకూరుకు చేందిన వై. జయకృష్ణ వారిచే హరికథా గానం కార్యక్రమాలను నిర్వహించింది. కళాకారుల ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

హోరాహోరీగా వృషభాల బల ప్రదర్శన పోటీలు

గడివేముల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన వృషభాల బలప్రదర్శన హోరాహోరీగా సాగింది. వృషభాల బలప్రదర్శనను మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సీతారామిరెడ్డి ప్రారంభించారు. ఆరుపండ్ల విభాగంలో రామావరం గ్రామానికి చెందిన అక్షయరెడ్డి ఎద్దులు 4,200 అడుగులు లాగి మొదటి స్థానాన్ని, పిన్నాపురం గ్రామానికి చెందిన వెంకటకృష్ణయ్య వృషభాలు 4,070 అడుగులు లాగి రెండో స్థానాన్ని, కడపకు చెందిన రాయల్‌రెడ్డి వృషభాలు 4009 అడుగులు లాగి మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. విజేతలైన వృషభాల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, కంది శ్రీనివాసులు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి

ఉద్యోగులకు నిరాశ మిగిల్చిన బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపాధ్యాయ, ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు కె.సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 12వ వేతన సవరణకు సంబంధించి ఇప్పటికే రెండేళ్లు ఆలస్యమైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలు, ఆర్థిక బకాయిలు ఇప్పటి వరకు చెల్లించకపోవడం ఉద్యోగులపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా తమ డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పుల్లయ్య, రవి, వెంకటేశ్వర్లు, మునిస్వామి, గోపాల్‌రావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కలబోతగా రాష్ట్ర బడ్జెట్

గడివేముల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కలబోతగా రాష్ట్ర బడ్జెట్ ఉందని జనసేన మండల నాయకులు చంద్రమోహన్ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూపొందించిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు నిధులు కేటాయించారని అన్నారు. సూపర్-6 పథకాలకు బడ్జెట్ కేటాయించడం హర్షణీయం అన్నారు. బీసీలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.

బడ్జెట్‌లో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట

నందికొట్కూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేశారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి దోహదపడే విధంగా ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం అవగాహనా రాహిత్యం వల్ల చిన్నాభిన్నమైనటువంటి ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు చేపడుతూ రూ.3 లక్షల 22 వేల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. సూపర్-6 పథకాలు అమలు చేస్తూ బడ్జెట్ కేటాయింపులు ఉండడం హర్షించదగ్గ విషయమన్నారు.

నేడు ప్రధానమంత్రి వెబ్‌నార్

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, గ్రామీణ శ్రేయస్సు అంశంపై శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెబ్‌నార్ కార్యక్రమం జరుగుతుందని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం.రవీందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌నార్ కార్యక్రమానికి కలెక్టర్ రాజకుమారితోపాటు బ్యాంకర్ల అధికారులు, వ్యవసాయ శాఖలోని వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులు, రైతులు పాల్గొంటారని చెప్పారు. కిసాన్ క్రెడిట్‌కార్డుల ద్వారా రైతులకు సంస్థాగత రుణాల లభ్యతను పెంచడం, ప్రకృతివైపరీత్యాలు సంభవిస్తే రైతులకు ఉపశమనం కలిగించడం, పునర్‌వ్యవస్థీకరణకోసం తీసుకోవాల్సిన అంశాలు, బడ్జెట్‌లో పేర్కొన్న ప్రతిపాదనలు తదితర అంశాలపై వెబ్‌నార్‌లో అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని చెప్పారు.

పటిష్ట భద్రతతో ఉత్సవాలు విజయవంతం



మాట్లాడుతున్న డీఎస్పీ రామ్‌జీనాయక్

శ్రీశైలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడంతో ఉత్సవాలు విజయవంతమయ్యాయని ఆత్మకూరు డీఎస్పీ రామ్‌జీనాయక్ అన్నారు. శుక్రవారం శ్రీశైలం పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల బందోబస్తులో భాగంగా 2500 మంది పోలీసులు విధులు నిర్వహించారని అన్నారు. 8 డ్రోన్ కెమెరాలు వాడటంతో పాటు 25 బ్లూకోర్టు ట్రాఫిక్ క్లియరెన్స్ బీడీ టీమ్స్, క్రైం పార్టీలు, పోలీసు సేవాదల్, 10 రక్షక వాహనాలను ఉపయోగించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీశైలం సీఐ జి. ప్రసాదరావు, టుటౌన్ సీఐ చంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేని మందులు విక్రయించవద్దు

వెలుగోడు ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని బయో మందులను విక్రయించవద్దని ఏడీఏ అంజనేయ అన్నారు. శుక్రవారం ఆయన వెలుగోడు మండలంలోని పలు ఎరువులు, మం దుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వీరబ్రహ్మేంద్ర ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.5 లక్షల విలువైన 114 లీటర్ల అనుమతులు లేని బయో మందుల విక్రయా లను ఆయన నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే జైకిసాన్ జువారి ఎరువుల దుకాణంలో తనిఖీలు చేసి రూ.60,500 విలువ గల మందుల విక్రయాలను నిలిపివేశారు. కార్యక్రమంలో ఈయన వెంట ఈవో పవన్ కుమార్, సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

నందికొట్కూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.ఆర్.సునీత సీవీ రామన్ సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్‌రెడ్డి, బౌతిక శాస్త్ర ఉపన్యాసకులు డా.మహబూబ్ భాష, ఇతర అధ్యాపకులు తలాట్ పర్వీన్, పరిమిళా దేవి పాల్గొన్నారు.

ఆత్మకూరు: శాస్త్ర విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని స్థానిక పద్మావతి హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, జి.పుల్లారెడ్డి స్కూల్‌లో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సాయి ప్రణీత్ ఆధ్వర్యంలో సైన్స్ డే కార్యక్రమాలు జరిగాయి.

- **గడివేముల:** మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం కరస్పాండెంట్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలతో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్మార్ట్‌సోలార్‌సిటి నమూన, నర్వస్‌సిస్టమ్, కెనాన్‌గన్, పెట్రోల్ బైస్కిల్, వాటర్ రాకెట్ లాంచ్ పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఏవో రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **నంద్యాల, హాస్పిటల్:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నంద్యాలలోని గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇంట్రా స్కూల్ సైన్స్ ఎక్స్ పో-2025 ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి, డా.జి.రామకృష్ణారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, టీడీపీ యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.జి.రవికృష్ణ, డైరెక్టర్ మౌలాలిరెడ్డిలు ప్రారంభించారు. భారతరత్న సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- **నంద్యాల, హాస్పిటల్:** నంద్యాలలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు 150 ప్రదర్శనలు ప్రదర్శించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ అలీమా తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో బ్రహ్మం ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు.
- **సంజామల:** మండలంలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సైన్స్ బోధిస్తున్న పుల్లయ్య ఆచారి శంకరయ్య మాస్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, వెంకటనారాయణ, సావిత్రమ్మ, ఓబులేసు, వెంకటరామిరెడ్డి, దీప్లా నాయక్, నాగార్జున, వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్న మౌలాలి, దస్తగిరి పాల్గొన్నారు.
- **మిడుతూరు:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం మిడుతూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాల, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు

అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు



నంద్యాలలో విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న దృశ్యం



ఆత్మకూరులో సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జి.పుల్లారెడ్డి స్కూల్ ఉపాధ్యాయులు

వైభవంగా శివపార్వతుల పల్లకి ఉత్సవం


చాగలమర్రిలో శివపార్వతుల ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలోని శివపార్వతుల ఉత్సవమూర్తులచే ఆర్యవైశ్యులు వైభవంగా పల్లకి ఉత్సవం నిర్వహించారు. శివరాత్రి ముగింపు సందర్భంగా, మాఘ అమవాస్య పురస్కరించుకొని శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలోని పురవీధుల గుండా శివపార్వతుల ఉత్సవమూర్తులచే ఊరేగింపు చేశారు. ఆలయంలో విష్ణు సహస్ర పారాయణం మహిళలు సామూహికంగా చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివప్రసాద్, అధ్యక్షుడు లక్ష్మణబాబు, కోశాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : టైలర్ల సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నట్లు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో టైలర్స్‌డే వేడుకల సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ టైలర్ల సమస్యలను వెల్లడిస్తే మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, సాయిరాం, గుండా మురళీధర్, అధిక సంఖ్యలో టైలర్లు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: సమాజంలో టైలర్ల పాత్ర కీలకమని టైలర్లు ఆర్థికంగా అభివృద్ధి చెంది అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ నాయకుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని పేరా శ్రీధర్‌రెడ్డి ఫంక్షన్ హాలులో న్యూ టైలర్స్ వెల్ఫర్ అసోషయేషన్ సంఘం అధ్యక్షులు అహ్మద్ ఉశేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పేరా శ్రీధర్‌రెడ్డి హాజరు అయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మహిళా టైలర్‌కు దాత అందించిన కుట్టు మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో టైలర్లు ఉపాధ్యక్షుడు రమణ, సెక్రెటరీ ఉశేన్‌పీరా, జాయింట్ సెక్రెటరీ ఖాజా, ట్రెజరర్ సురేంద్ర, సుబ్బారెడ్డి కమలహాసన్, ఉశేన్‌వళి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస క్షేత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అవుకు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు, పాడియజమానుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశుగ్రాస క్షేత్రాలు, గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ రమణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్, సహాయ సంచాలకులు మారుతి సకారంతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు భారతీదేవి, రామ్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, టీడీపీ నాయకులు ఆకుల నాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, శివారెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషను సంరక్షించుకోవాలి


మాట్లాడుతున్న రాజారెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : తెలుగుభాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువాడిపై ఉందని అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ హిందీ, ఆంగ్లం రాకతో తెలుగుభాష ప్రమాదంలో పడిందన్నారు. దేశభాషలందు తెలుగులెస్స అని ఏనాడో శ్రీకృష్ణదేవరాయలు తెలియజేశారన్నారు. వ్యాపార సముదాయాల పేర్లు తెలుగులోనే ముద్రించాలన్నారు. 10వతరగతి వరకు తెలుగుభాషను తప్పనిసరి పెట్టాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరీలను కోరారు.

రాష్ట్ర బడ్జెట్‌పై టీడీపీ శ్రేణుల హర్షం

శిరివెళ్ల/చాగలమర్రి/ఉయ్యాలవాడ/డోన్‌రూరల్/కొలిమిగుండ్ల ఫిబ్రవరి 28, ఆంధ్రజ్యోతి: ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం 2025-26 బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. బడ్జెట్‌పై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల అమలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందంటున్నారు. సూపర్ సిక్స్, పథకాల్లో భాగమైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పింఛన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తుండగా.. మరికొందరు పెదవి విరుస్తున్నారు.

అన్ని రంగాలకు చేయూత



రాష్ట్రంలోని అన్ని రంగాలకు చేయూత అందించే విధంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వంలో ఎన్నో రంగాలు నిర్వీర్యమవగా నేడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసింది. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా బడ్జెట్ కేటాయించడం హర్షణీయం.

- కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్, శిరివెళ్ల

తల్లికి వందనంపై హర్షం



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన తల్లికి వందన పథకం అమలు చేయడం హర్షణీయం. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ తల్లికి వందనం అందించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి.

- బి.రవీంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్, పీఆర్టీయూ, చాగలమర్రి

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. అన్ని రంగాలకు న్యాయం జరిగేలా బడ్జెట్‌ను కేటాయించారు. సూపర్-6 పథకాల అమలుకు బడ్జెట్ కేటాయించడం అభినందనీయం.

- గుత్తి నరసింహులు, టీఎన్‌టీయూసీ, రాష్ట్ర కార్యదర్శి

అన్ని రంగాలు అభివృద్ధి చెందే బడ్జెట్



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు అయ్యేలా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

- రామసుబ్బారెడ్డి, ఉయ్యాలవాడ మండలం, ఇంజేడు గ్రామస్తుడు

ఆరోగ్యశాఖకు ప్రాధాన్యత



రాష్ట్రంలోని ప్రజల కళలకు అద్దం పట్టేలా బడ్జెట్‌ను రూపొందించారు. ఆరోగ్యశాఖకు సరైన ప్రాధాన్యత ఇస్తూ దాదాపు 6 శాతం కేటాయించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం అభినందనీయం.

- యామా గుర్రప్ప, మాజీ జడ్పీటీసీ, శిరివెళ్ల

ఆనందంగా ఉంది..



రాష్ట్రంలోని బీసీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ ద్వార బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం పథకాలకు నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. అభివృద్ధి, సంక్షేమంతో పాటు హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

- కొండబోయిన బాలచంద్రుడు, మాజీ ఎంపీటీసీ, శిరివెళ్ల

వ్యవసాయ రంగానికి పెద్దపీట



2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అభివృద్ధికి రూ. 48,341 కోట్ల నిధులు కేటాయించటం సంతోషంగా ఉంది. దీంట్లో విత్తన పంపిణీ, వడ్డీ లేని రుణాలు, అన్నదత సుఖీభవ లాంటి పథకాలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించటం బాగుంది.

- సుధాకర్ రెడ్డి, రైతు, అల్లూరు గ్రామం

జనరంజక బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై ఆయనకున్న చిత్తశుద్ధిని మరోసారి తెలియజేశారు.

● వై.హనుమంతరెడ్డి, డోన్

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం మోడల్ ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించడం అభినందనీయం. తగినన్ని నిధులు బడ్జెట్‌లో కేటాయించి విద్యారంగ అభివృద్ధికి చేయూతనివ్వాలి. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ బడ్జేట్‌లో 9.86 శాతం మాత్రమే నిధులు కేటాయించడం సరికాదు.

- శివశంకర్, రాష్ట్ర అదనపు కార్యదర్శి, ఎస్టీయూ

నిరుద్యోగ భృతికి కేటాయింపులు చేయకపోవడం బాధాకరం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

డోన్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమని డోన్ కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీపై బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేవని అన్నారు. తల్లికి వందనం పథకానికి అరకొర నిధులు ప్రభుత్వం కేటాయించిందని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుఉ మల్లెంపల్లె జనార్దన్, వై.శేఖర్, పటాన్ హుశేన్ పాల్గొన్నారు.

ప్రజలకు భరోసాగా బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఉంది. బీసీ సంక్షేమం కోసం రూ.23,260 కోట్లు కేటాయించడం హర్షణీయం. చరిత్రలోనే తొలిసారిగా మైనార్టీ, బీసీ సంక్షేమానికి బడ్జేట్‌లో ప్రాధాన్యత కల్పించడం హర్షణీయం. బీసీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీఠ వేసిందని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు బడ్జేట్ భరోసా నింపింది.

- లక్ష్మీనారాయణగౌడ్, అధ్యక్షుడు, మండల బీసీ సంఘం

మధ్యతరగతి వారి బడ్జెట్



బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల ఆరోగ్యం కోసం ప్రాధాన్యతనివ్వడం ఎంతో అభినందనీయం. రూ.25లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా కల్పించడం వారి జీవితాల్లో వెలుగులు నింపినట్లే. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి కార్పోరేట్ వైద్యాన్ని దగ్గర చేయడం పేదల జీవితాల్లో వెలుగు నింపుతుంది.

- వీఆర్.లక్ష్మీరెడ్డి టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త

సూపర్ సిక్స్‌కు పెద్దపీట



సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్ పెద్దపీట వేయడం ప్రజలకు శుభ పరిణామం. తల్లికి వందనం ఈఏడాది నుంచే అమలు కావడం ప్రజలకు తీపి కబరు. పథకానికి బడ్జెట్లో రూ.9407కోట్లు కేటాయించడం హర్షనీయం.

- గొంగటి హుస్సేన్‌రెడ్డి, టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు

బుగ్గన పిట్ట కథలు ప్రజలు నమ్మరు..

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పిట్ట కథలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేశామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారనీ ఆరోపించారు. ప్యాపిలి మండలం ఉడుములపాడు చెరువును సందర్శించి చెరువును నీటితో నింపే కార్యక్రమంపై బుగ్గన విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. తానూ రైతుబిడ్డనే అని, రైతులకు న్యాయం జరిగేలా నియోజకవర్గంలో అన్ని చెరువులను నీటితో నింపి రైతులకు సాగునీరు ఇచ్చి తీరుతామన్నారు. గుడిపాడు చెరువు పైపులైన్ పనులు జరుగుతున్నాయని, వాటిని కూడా పూర్తి చేసి వారంలోపు పనులు పూర్తి చేసి గుడిపాడు చెరువుకు నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల ప్రణాళిక తో ముందుకు పోతున్నామన్నారు. సమావేశంలో డోన్, బేత ంచెర్ల మండలాల నాయకులు మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, చంద్రపల్లె లక్ష్మీనారాయణ, రాఘవరెడ్డి, గొల్ల నాగయ్య, పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండు మల్లేశ్వరస్వామి సన్నిదిలో రాష్ట్ర స్థాయి యు.కేటగిరి బంలాగుడు పోటీలను శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈపోటీల్లో 7జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.40వేలు ప్యాపిలి మండలం రంగాపురం రామక్రిష్ణారెడ్డి, డోన్ మండలం మల్లెల గ్రామం షేక్ మైమున్నీసా వృషభాలు సంయుక్తంగా గెలుపొందాయి. ద్వితీయ బహుమతి రూ.30వేలు రంగాపురం గ్రామం రామక్రిష్ణారెడ్డి, యాడికి మండలం అప్పారెడ్డిపల్లె సిద్ధవటం దేవేంద్రరెడ్డి వృషభాలు సంయుక్తంగా గెలుపొందాయి, తృతీయ బహుమతి రూ.20వేలు సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామం సురేంద్ర వృషభాలు దక్కించుకున్నాయి. నాలుగో బహుమతి రూ.10,000 కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెకు చెందిన చెన్నారెడ్డి గారి ఆరునాథరెడ్డి వృషభాలు గెలుచుకున్నాయి. విజేతలకు దాతల సహకారంతో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నగదు బహుమతులు అందజేశారు.

చెత్త సంపద కేంద్రాలను ప్రారంభించాలి

దొర్నిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సావిత్రి, ఈవోపీఆర్డీ నాగ అనసూయ అన్నారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేదం చేపట్టేలా చర్యలు చేపట్టాలని అన్నారు. చెత్తసంపద తయారు కేంద్రాలను పునరుద్ధరించేలా చూడాలని అన్నారు. అర్జునాపురం గ్రామం పైలెట్ విలేజ్ గ్రామంగా ఎంపికైందని అన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల రిసోర్స్‌పర్సన్ తదితరులు ఉన్నారు.

అమృతవల్లి అమ్మవారికి విశేష పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో అమృతవల్లి అమ్మవారికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ముందుగా వచ్చే శుక్రవారంను(కడ శుక్రవారం) పురస్కరించుకుని అమృతవల్లి అమ్మవారికి నవకలశ తిరుమంజనం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ మేనేజర్ మురళీధరన్, ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ పాల్గొన్నారు.



కన్నుల పండువగా
ఉమా మహేశ్వరస్వామి రథోత్సవం


ముచ్చట్లలో అశేష భక్తజనం మధ్య మల్లికార్జున స్వామి రథోత్సవం

బనగానపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఆలయంలో ఉమామహేశ్వర స్వామి రథోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ రథోత్సవ వేడుకల్లో పాల్గొని మొదటి పూజలు చేశారు. ఆలయ ఈవో చంద్రుడు, బండి మౌళీశ్వరరెడ్డి, ఆలయ పూజారులు మహేశ్వరశర్మ, కిశోరయ్య, ఆయకట్టు గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి, పాతపాడు టీడీపీ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, బత్తుల బాస్కర్‌రెడ్డి, రామారెడ్డి పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణం సమీపంలోని పాతబుగ్గ, కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో శుక్రవారం రాత్రి వేలాది మంది భక్తుల మధ్య శివపార్వతుల రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. రథోత్సవ వేడుకల్లో పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును నిర్వహించారు. కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొని మజ్జిగను పంపిణీ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే కోట్ల, మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ముచ్చట్ల మల్లికార్జున స్వామి రథోత్సవం

బేతంచెర్ల: బేతంచెర్ల మండలంలోని మహాశివరాత్రి సందర్భంగా ముచ్చట్ల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం ఊరేగించారు. ఆలయ మాఢ వీధుల్లో భక్తుల నృత్యాలు, నందికోల సేవలతో ఊరేగించారు. కార్యక్రమంలో అంబాపురం, రంగాపురం, బేతంచెర్ల, హెచ్.కొట్టాల, కొమ్మారి కొట్టాల ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ


రథం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

సైన్స్‌తోనే మానవ ప్రగతి

సైన్స్‌తోనే మానవ ప్రగతి ముడిపడి ఉందని వక్తలు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో, కాలేజీల్లో నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు నమూనాలను ప్రిన్సిపాల్ పరిశీలించారు.


చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయినిలు


మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


శిరివెళ్ల: యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో సైన్స్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్


డోన్‌లో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ప్యాపిలి: అయోధ్య రామ మందిరం నమూనాతో విద్యార్థి రఫీ


బనగానపల్లెలో మాట్లాడుతున్న అధ్యాపకుడు ఉమామహేశ్వరరెడ్డి


అవుకులో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి


బేతంచెర్లలో విద్యార్థుల ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


కొలిమిగుండ్లలో...